క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని వైష్ణవి గార్డెన్స్‌లో శనివారం భవన నిర్మాణ 10 రంగాలకు చెందిన కార్మికులు సమావేశమై నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొమ్మగళ్ల కృష్ణ అధ్యక్షతన రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాసమల్ల కొమురయ్య, జిల్లా అధ్యక్షుడు వాతాల యాదగిరి సమక్షంలో ఎన్నిక జరిగింది. మండల అధ్యక్షుడిగా కొట్టె ప్రేమ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా గొడిశాల సోమయ్య, నీలం భాస్కర్, తూడి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కొయ్యడ యాదగిరి, కోశాధికారిగా చెరుకు రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు తూడి అంజయ్య, పోకల శ్రీనివాస్, వెంకటస్వామి, రత్నం, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



జనగామ రూరల్: పట్టణంలోని నెహ్రూపార్క్ లోగల యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎర్రకల్ హవేలీకి బదిలీ అయ్యారు. కాగా, శనివారం మండలంలోని పెంబర్తి, ఎల్లంల, సిద్దెంకి, పెద్దరాంచర్ల, మహిళా సంఘాల సభ్యులు తదితరులు ఆయనను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఖాతాదారులకు శ్రీకాంత్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. రైస్‌మిల్లు యాజమాన్యం, రైతులు, బ్యాంక్ మేనేజర్ కె.ఉత్తమ్, విక్రమ్, జయప్రకాష్, శిల్ప, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అతిథి భోజనం

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మి పుట్టినరోజును పురస్కరించుకొని విద్యార్థులకు అతిథి భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు మహ్మద్ అంకుషావలి మాట్లాడుతూ వెంకటలక్ష్మి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు ఫరీదాబేగం, వెంకటనర్సింహ్మారెడ్డి, వారి కుమారులు వంశీకృష్ణ, ధీరజ్‌కృష్ణ, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, అంగన్‌వాడీ టీచర్, ఆయా, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌండ్ స్పీకర్ బహూకరణ


జఫర్‌గఢ్: మండలంలోని హిమ్మత్‌నగర్ ఉన్నత పాఠశాలలో గత కొన్నేళ్ల పాటు విధులు నిర్వహించి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులు నక్క కుమార్, పోలేపల్లి లక్ష్మణ్, మహ్మద్ సులావుద్దీన్, పుష్పాల సుమలత రూ.16 వేల విలువ చేసే సౌండ్‌స్పీకర్‌ను హెచ్ఎం మంగు జయప్రకాశ్‌కు శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ రాపర్తి రమ, మాజీ సర్పంచ్ తాటికాయల ఆశోక్, మాజీ ఎంపీటీసీ యారా నీలమ్మ సోమిరెడ్డి పాల్గొన్నారు.

విరాళం



నర్మెట: మండల కేంద్రంలోని కాశీవిశ్వనాథ శివాలయం అభివృద్ధికి ఉప్పుగాళ్ల రవీందర్ రూ. 50,116లను శనివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ గౌరవ అధ్యక్షుడు గంగం నర్సింహారెడ్డి మాట్లాడుతూ పవిత్రమైన అతి పురాతన ఆలయ అభివృద్ధికి మరింత మంది దాతలు సహకరించాలని కోరారు.

కుక్కల దాడిలో మేకల మృతి



మృతి చెందిన మేక

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు ఇందిరానగర్‌కు చెందిన తాటికొండ రజాక్‌కు చెందిన ఆరు మేకలు వీధి కుక్కల దాడిలో మృతిచెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం జరుగగా శనివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడు రజాక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇందిరానగర్ కాలనీలో తమ కొట్టంలోకి రోజూ మాదిరిగానే శుక్రవారం సాయంత్రం మేకలను తోలాడు. ఇటీవల కాలనీలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, ఈ క్రమంలోనే సాయంత్రం కొట్టంలోకి వచ్చిన కుక్కలు మేకలపై దాడి చేశాయన్నారు. ఉదయం కొట్టం వద్దకు వెళ్లిచూసేసరికి ఆరు మేకలు గాయాలతో మృతిచెంది ఉన్నాయన్నారు. కుక్కల దాడితోనే ఆరు మేకలు మృతిచెందాయని, రూ.40వేల నష్టం జరిగిందని తెలిపాడు. కుక్కల సమస్యపై పలుమార్లు చెప్పినా గ్రామ పంచాయతీ వారు పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దేవరుప్పుల ఎస్సైగా సృజన్‌కుమార్

దేవరుప్పుల: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎస్సై ఎస్.చెన్నకేశవులు జనగామకు ఇటీవల బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో అక్కడి నుంచి ఊర సృజన్‌కుమార్‌ను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై సృజన్‌కుమార్‌ను సంప్రదించగా సోమవారం విధుల్లో చేరుతున్నానని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

జిల్లా వ్యాప్తంగా శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మమాట–అంగన్‌వాడీ బాట ర్యాలీని నిర్వహించి చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, అంగన్‌వాడీల్లో అందించే సౌకర్యాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



నర్మెట: మచ్చుపహాడ్‌లో అక్షరాభ్యాసం చేయిస్తున్న సూపర్‌వైజర్ సునీతాదేవి



తరిగొప్పుల: చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత



రఘునాథపల్లి: శ్రీమన్నారాయణపురంలో..



చిల్పూరులో..



స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ దివ్య



బచ్చన్నపేట: కొడవటూర్‌లో..



పాలకుర్తి: బమ్మెరలో..

'విద్యార్థుల చదువుపై ఆందోళన చెందొద్దు'



చిల్పూరు: మాట్లాడుతున్న సోని

చిల్పూరు: కస్తూర్బాగాంధీ విద్యాలయంలో చేరిన విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందొద్దని కేజీబీవీ ఇన్‌చార్జ్ ఎస్ఓ సోని అన్నారు. మండలంలోని రాజవరం గ్రామ పంచాయతీలో ఉన్న కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సోని మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్, భద్రత తమదే అని అన్నారు. తల్లిదండ్రులు సెలవుల రోజుల్లో తప్ప ఎప్పుడు పడితే అప్పుడు విద్యార్థులను చూసేందుకు వస్తే వారికి చదువుపై శ్రద్ధ పోతుందని తెలిపారు. ఆర్‌కే పంతం రాజుకుమార్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి తోడ్పడాలి

జఫర్‌గఢ్: తల్లిదండ్రులు పాఠశాల విద్యాభివృద్ధికి తోడ్పడాలని హెచ్ఎం తిరుమల రాజు కోరారు. మండలంలోని తిమ్మంపేట పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంప్లెక్స్ స్కూల్ హెచ్ఎం షారోన్, అంగన్‌వాడీ సూపర్ వైజర్ అనిత, అంగన్‌వాడీ టీచర్లు రాణి, శాంత, తాళ్లపల్లి అనిత, ఉపాధ్యాయులు సుమతి, మాజీ విద్యాకమిటీ చైర్మన్ కుంభోజి మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించాలి

పాలకుర్తి టౌన్: విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించాలని చెన్నూరు ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీహరి అన్నారు. చెన్నూరు ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పాలకుర్తి: సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. వరంగల్ సీపీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని బమ్మెర జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



బచ్చన్నపేటలో..

స్టేషన్‌ఘన్‌పూర్: సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని సముద్రాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కావ్య, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇందిర ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. జై రేవంత్, జైజై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, యువకులు, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: రైతుల రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఫ్లెక్సీకి మండలంలోని నారాయణపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. గ్రామ శాఖ అధ్యక్షుడు పరిదె శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాసపేట రవీందర్‌రెడ్డి, నియోజకవర్గ కిసాన్ కోఆర్డినేటర్ జంగిటి నరేష్, నాయకులు ఉపాచారి, రాములు ఉన్నారు.

హ్యాండ్ వాష్ బాటిళ్ల పంపిణీ



బచ్చన్నపేట: మండల కేంద్రంలోని బీడీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు హ్యాండ్ వాష్ బాటిళ్లను పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు భోజనం చేసే ముందు హ్యాండ్ వాష్ చేసుకుంటే వ్యాధులబారిన పడకుండా ఉంటారని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు క్రమం తప్పకుండా చిన్నారులు చేతులను శుభ్రంగా కడుక్కునేలా చూడాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ టీచర్లు కౌసల్య, జ్యోతి, కవిత, విజయలక్ష్మి, రజని, బాలమణి, వనజ, భాగ్యలక్ష్మి, లక్ష్మి, ఆయా, చిన్నారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు



గాయపడ్డ గంగు

స్టేషన్‌ఘన్‌పూర్: వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్తున్న రైతు బానోత్ గంగు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైరు తాకడంతో విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని జిట్టిగూడెం తండా శివారు నారాయణలొద్ది తండాలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణలొద్ది తండాలో వ్యవసాయ భూముల వద్ద శుక్రవారం ఒక రైతు పొలం దున్నుతుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు విద్యుత్‌పోల్‌కు తగులడంతో పోల్ కాస్త వంగి పొలాల మీదుగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు కిందికి వేలాడింది. వెంటనే రైతులు విషయాన్ని తాటికొండ లైన్‌మన్‌కు సమాచారం అందించారు. అతడు తన పరిధి కాదని చెప్పడంతో పక్కనే ఉండే ఫత్తేపూర్ లైన్‌మన్‌కు కూడా సమాచారం ఇచ్చారు. అయితే ఇద్దరు లైన్‌మన్ల మధ్య సమన్వయ లోపంతో కిందికి జారిన వైరును ఎవ్వరూ సరిచేయలేదు. కాగా, బానోత్ గంగు రోజూమాదిరిగానే తన వ్యవసాయ భూమి వద్దకు శనివారం ఉదయం వెళ్లాడు. అయితే పొలాల మీదుగా ఉన్న 11 కేవీ వైరు కిందికి జారి ఉండటంతో పొలంలో వరం మీదుగా వెళ్తున్న గంగుకు నెత్తిపై వైరు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో చేతిపై, ఛాతిపై చర్మం కాలి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉంది.

వైరు సరిచేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదు..

పొలాల మీదుగా ఉన్న 11 కేవీ విద్యుత్ వైరు కిందికి వేలాడుతుందని రైతులు అందించిన సమాచారం మేరకు శుక్రవారం విద్యుత్ సిబ్బంది స్పందించి వైరును సరిచేస్తే ప్రమాదం జరిగేది కాదు. తాటికొండ, ఫత్తేపూర్ లైన్‌మన్ల సమన్వయ లోపం, నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని తండావాసులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదానికి విద్యుత్‌శాఖ అధికారులే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. కాగా విద్యుత్ లైన్ కిందికి వేలాడుతుందని చెప్పినా పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన లైన్‌మన్ సురేందర్‌రెడ్డి, ఏఈ చంద్రమోహన్‌పై బాధితుడి భార్య నీరోజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముస్క రాజు తెలిపారు.

అధ్వానంగా ఘన్‌పూర్ సర్వీసురోడ్డు



బస్టాండ్ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న గుంతలు

అవస్థలు పడుతున్న వాహనదారులు


స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌లో జాతీయ రహదారి పక్కన ఉన్న సర్వీస్‌రోడ్డు అధ్వానంగా, గుంతలమయంగా మారింది. గుంతలరోడ్డుపై ప్రయాణం చేసేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఘన్‌పూర్‌లో పాత గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు ఉన్న సర్వీసురోడ్డుపై ప్రతీరోజూ ఆర్టీసీ బస్సులు, వ్యాన్‌లు, కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలు అనునిత్యం నడుస్తుంటాయి. హైవే పై నుంచి ఆర్టీసీ బస్సులు బస్టాండ్ వైపు వెళ్లాలన్నా ఇదే ప్రధాన దారి. అయితే ఈరోడ్డంతా గుంతలుగుంతలుగా అధ్వాన్నంగా మారింది. ప్రస్తుత వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతలపై వర్షపునీరు నిలుస్తుండగా వాహనదారులు రోడ్డుపై ప్రయాణం చేయాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. ప్రధానంగా బైక్‌లు, ఆటోలకు తీవ్ర అంతరాయంగా ఉంది. ఈరోడ్డుపై గుంతలతో పలువురు ద్విచక్రవాహనదారులు గతంలో రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయమై పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలకు శాపంగా పరిణవిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సర్వీసు రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి వేయించి వాహనదారుల కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

భానాజీపేటలో గీత కార్మికుడికి..

రఘునాథపల్లి: ప్రమాదవశాత్తు గీత కార్మికుడు తాటి చెట్టు పైనుంచి పడి తీవ్ర గాయాలపాలైన సంఘటన మండలంలోని భానాజీపేటలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గీత కార్మికుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లు సాయంత్రం రోజు వారిగా గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకు జారి కిందపడ్డాడు. దీంతో చేతులు, నడుంకు తీవ్ర గాయాలైన అతడిని తోటి కార్మికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతున్న వెంకటేశ్వర్లును పలువురు నాయకులు పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధిత గీత కార్మికుడికి ప్రభుత్వం మెరుగైన వైద్యం అందజేయాలని గ్రామ గౌడ సంఘం నాయకులు కోరుతున్నారు.

సేఫ్టీ మోకులు అందజేయాలి

కల్లు గీత కార్మికుల ప్రమాదాల నివారణకు ఉచితంగా వెంటనే సేఫ్టీ మోకులు అందజేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నె వెంకటమల్లయ్యగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత గీత కార్మికుడిని ఆయన సంఘం నాయకులతో కలిసి పరామర్శించి మాట్లాడారు. మెడికల్ బోర్డు విధానం తొలగించాలని, వృత్తిలో గీత కార్మికుడికి ఎక్కడ ప్రమాదం జరిగినా ప్రభుత్వం రూ 5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్ దూసరి గణపతి, గొరిగ రవి, ఉప్పలయ్య, కుర్ర రాజు, బాల్నె రాజయ్య, బుర్ర లక్ష్మినారాయణ, గైని శ్రీనివాస్, పగిడిపల్లి రాజు, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, పుల్ల విక్రంగౌడ్ తదితరులు ఉన్నారు.



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ శివారు నమిలిగొండలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, కళాశాలలో 6,7,8,9,10వ తరగతుల్లో, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23న నిర్వహించే స్పాట్ అడ్మిషనకు వచ్చే విద్యార్థులకు పరీక్ష నిర్వహించి తీసుకోబడునని, వివరాల కోసం 9848561693 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలి



జనగామ రూరల్: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న స్వామి తదితరులు

జనగామ రూరల్: అన్ని రంగాల్లో వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని మత్స్యసహకార సంఘం డైరెక్టర్ నిమ్మల స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి తహసీల్దార్ వెంకన్నకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా ఉపాధి అవకాశాలు లభించక యువత ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తమ్మలి పర్శరాములు, గడ్డం ప్రభాకర్, మచ్చ రమేశ్, గువ్వల ఉప్పలయ్య పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభ్యున్నతికి రిజర్వేషన్ మార్పు చేయాలి

దేవరుప్పుల: ముదిరాజ్‌ల సామాజికవర్గ అభ్యున్నతి కోసం రిజర్వేషన్ మార్పు చేయాలని ముదిరాజ్ సొసైటీ జిల్లా ఉపాధ్యక్షుడు గంగర బోయి మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల తహసీల్ కార్యాలయం వద్ద ముదిరాజ్ కులస్తులను బీసీ-డీ నుంచి బీసీ-ఏలో చేర్చాలనే నాయబ్ తహసీల్దార్ నవీన్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మండల ముదిరాజ్ సొసైటీల మండల ప్రతినిధులు నర్ర సోమశేఖర్, బోండుగుల సోమయ్య, కాశబోయిన మల్లేశ్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు సహజం



చిల్పూరు: బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎం నర్సింహారెడ్డి తదితరులు



జనగామ రూరల్: ఫాతిమాను సన్మానిస్తున్న వీరాంజనీదేవి తదితరులు



దేవరుప్పుల: అంజయ్యను సన్మానిస్తున్న విద్యార్థులు

చిల్పూరు: విద్యార్థులతో మమేకమైన సమయంలో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు సహజమని హెచ్ఎం కేతిడి నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, తెలుగు ఉపాధ్యాయురాలు మూల లక్ష్మి పదోన్నతితో బదిలీ అయ్యారు. కాగా వారికి శనివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జీడీ ఆనందం, మర్రి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జనగామ రూరల్: మండలంలోని ఓబుల్‌కేశావాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు ఉపాధ్యాయులు పదోన్నతి పొంది బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వీడ్కోలు సమావేశం నిర్వహించి వారిని ఘనంగా సన్మానించారు. హెచ్ఎం వీరాంజనీదేవి, రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రాజయ్య, కనీస ఫాతిమ, హన్మంతారావు, రిందా దేవి, సంధ్య, సత్యనారాయణ, శ్రీధర్, విష్ణుమూర్తి, రవికుమార్, శాంతి కుమారి ఆదర్శ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబటి అంజయ్యకు..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల పురోగతి కోసం తొమ్మిదేళ్లపాటు విస్తృత సేవలందించిన ఇటీవల బదిలీపై సింగరాజుపల్లికి వెళ్లిన ఉపాధ్యాయుడు అంబటి అంజయ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించి ఘనంగా సన్మానించారు. మల్లమ్మ, తోటకూరి రేణుక కిష్టయ్య, హెచ్ఎంలు ఉమారాణి, విజయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ముందస్తు అరెస్టులు అప్రజాస్వామికం'



జఫర్‌గఢ్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

జఫర్‌గఢ్: సమస్యలపై పోరాడుతున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్, ఎదులాపురం జయశంకర్ అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నా సందర్భంగా మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడంపై నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో పవన్‌యాదవ్, లింగరాజు తదితరులు ఉన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: నిరుద్యోగుల సమస్యల పరిష్కరించాలని పోరాడుతుంటే ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయించడం సరికాదని బీజేవైఎం మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో చేపట్టిన మహాధర్నాకు తరలివెళ్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం దారుణమన్నారు. ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోక పోగా ప్రశ్నించడానికి వెళ్తున్న నాయకులను అరెస్టు చేయడం తగదన్నారు.

'అంగన్‌వాడీల్లో 3వ తరగతి వరకు సమంజసం కాదు'

స్టేషన్‌ఘన్‌పూర్: అంగన్‌వాడీ కేంద్రాలను ప్లే స్కూల్స్‌గా మార్చి మూడో తరగతి వరకు నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైనది కాదని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర స్టడీ సర్కిల్ సభ్యుడు, జిల్లా ఉపాధ్యక్షుడు మంగు జయప్రకాశ్ అన్నారు. ఘన్‌పూర్‌లో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంగన్‌వాడీలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా తల్లిదండ్రులు గుర్తించడం లేదని, ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు.

ఎంపీకి వినతిపత్రం అందజేత



చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాల జాతీయ రహదారిపై నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం రాత్రి గ్రామ కాంగ్రెస్ నాయకులు వరంగల్ ఎంపీ కడియం కావ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఇల్లందుల యాదగిరి, తాళ్లపల్లి సమ్మయ్య, మామిడాల యాదవరెడ్డి, బుచ్చయ్య, హరిబాబు, సంపత్, రాజ్‌కుమార్, బుచ్చికొంరయ్య పాల్గొన్నారు.